
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కర్నూలు
జిల్లా వార్తలు
సోమవారం 9 సెప్టెంబరు 2024



పరిపాలన గణపతికి ఘనంగా పూజలు



పూజల్లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 8: వినాయక చవితి సందర్భంగా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన పరిపాలన గణనాథుడికి కలెక్టర్ పి. రంజిత్ బాషా విశేష పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణనాథుని ఆశీస్సులతో జిల్లా పాడిపంటలతో సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఆర్వో చిరంజీవి, కలెక్టరేట్ ఏవో రాజేశ్వరి, ఏపీ ఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు గిరి కుమార్ రెడ్డి, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఊరంతా గణపతి వేడుక



కర్నూలులోని కాళికాంబ ఆలయంలో వినాయకుడు


- వాడవాడలా కొలువుదీరిన గణనాథులు
- మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు

కర్నూలు (కల్చరల్), సెప్టెంబరు 8:

తొలిపూజల ఇలవేలుపు గణపతిని జిల్లా ప్రజలు శనివారం భక్తిశ్రద్ధలతో సేవించారు. ఇండ్లలో చిన్న గణపతి విగ్రహాలను నెలకొల్పి పూజలు చేశారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నగరంలోని అనేక ప్రాంతాల్లో, కూడళ్లలో గణపతి విగ్రహాలను నెలకొల్పారు. జిల్లా వ్యాప్తంగా గణేశ్ నవరాత్రి ఉత్సవాల సందడి బాగా కనిపించింది. పోటాపోటీగా నెలకొల్పిన భారీ విగ్రహాలు ఆకర్షణీయంగా నిలిచాయి. గణేశ్ మంటపాలను నిర్వాహకులు రంగురంగుల విద్యుద్దీపాలతో తీర్చి దిద్దారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పూజాది కార్యక్రమాలు చేపట్టారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కర్నూలు నగరంలో ఎన్ఆర్ పేట, కొత్త పేట, ధర్మపేట, పాతబస్టాండు, మించిన్ బజార్, వన్‌టౌన్, కుమ్మరిగేరి, వడ్డేగేరి, బుధవారపేట, వెంకటరమణకాలనీ, శ్రీనివాసనగర్, గణేశ్‌నగర్, బి.క్యాంపు తదితర ప్రాంతాల్లో భక్తుల సందడి కనిపించింది.



ఆదోనిలో గొర్రెల కాపరిగా వినాయకుడు



కర్నూలులోని వడ్డేగేరిలో..



కర్నూలు నగరంలోని కుమ్మరి గేరిలో..



రాంభొట్ల దేవాలయంలో..



పూలబజార్‌లో..



మించిన్ బజార్‌లో కొలువుదీరిన గణనాథుడు

దరఖాస్తుల వెల్లువ



గత టీడీపీ ప్రభుత్వ హయాంలో నిర్మించిన గోకులం షెడ్డు

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 8:

ఉమ్మడి జిల్లాకు ప్రభుత్వం 2,050 గోకులం షెడ్లును కేటాయించింది. ప్రభుత్వం మినీ గోకులాలను మంజూరు చేయడంతో రైతన్నలు, పాడి గేదెల యజమానులు సంతోషం వ్యక్తం చేశారు. ఇక తమ పశువులు, పాడి గేదెలు, ఎండా వానకు తడవాల్సిన అవసరం ఉండదని, ప్రభుత్వమే మినీ గోకులాల షెడ్లు నిర్మిస్తుండటంతో తమకు ఆర్థిక ఇబ్బందులు తప్పిపోతాయని ఆనందపడ్డారు. అయితే.. కేటాయింపునకు మించి రెట్టింపు దరఖాస్తులు రైతుల నుంచి పాడిగేదెల యజమానుల నుంచి వెల్లువలా వస్తుండటంతో పశుసంవర్ధక శాఖ అధికారులు ఎవరికి ఇవ్వాలో దిక్కుతోచని పరిస్థితి ఎదుర్కొంటున్నారు. కర్నూలు జిల్లాకు 1200 మినీ గోకులాల షెడ్లు మంజూరైతే.. దాదాపు 2,500 దాకా దరఖాస్తులు వచ్చినట్లు జేడీ శ్రీనివాసులు తెలిపారు. అలాగే నంద్యాల జిల్లాకు 850 గోకులం షెడ్లు మంజూరైతే దాదాపు 2,180 దరఖాస్తులు వచ్చాయని నంద్యాల జేడీ మోహన్ లాల్ నాయక్ తెలిపారు.

కేటాయించినదానికంటే రెట్టింపు దరఖాస్తులు రావడంతో ఎవరికి ఇవ్వాలో అర్థంగాక పశుసంవర్ధక శాఖ అధికారులు తలపట్టుకుని కూర్చున్నారు. గోరుచుట్టుపై రోకటిపోటులా మరోవైపు ఎమ్మెల్యేలు, వారి అనుచరులు తాము చెప్పిన వారికే గోకులం షెడ్లు మంజూరు చేయాలని హుకుం జారీ చేయడంతో దిక్కుతోచని పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

- గోకుల షెడ్ల కోసం లెక్కకు మించి వచ్చిన అప్లికేషన్లు
- కర్నూలు జిల్లాలో 1200 మంజూరైతే.. 2,500 దరఖాస్తులు
- నంద్యాల జిల్లాకు 850 షెడ్లు.. 2,180 దరఖాస్తులు
- మా వారికే ఇవ్వాలంటూ ఎమ్మెల్యేల ఒత్తిళ్లు
- దిక్కుతోచని పశుసంవర్ధక శాఖ అధికారులు
- ఉమ్మడి జిల్లాకు మొత్తం 2,050 షెడ్లు మంజూరు

పట్టించుకోని గత ప్రభుత్వం

గత వైసీపీ ప్రభుత్వంలో మూగజీవాల సంరక్షణ పూర్తిగా పడకేసింది. కనీసం వాటికి నీడనిచ్చేందుకు గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన గోకులం షెడ్ల రైతులకు బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేసింది. మూగ జీవాలకు మేతను అందించే పథకాలకు కూడా గండి కొట్టింది. ఆ మూగ జీవాల ఉసురు తగిలిందేమో గానీ వైసీపీ ప్రభుత్వం నామరూపాల్లేకుండా పోయింది. ప్రస్తుతం అధికారం చేపట్టిన తెలుగుదేశం పార్టీ మళ్లీ వాటిపై దృష్టి సారించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు 2,050 షెడ్లను కేటాయించింది. కర్నూలు జిల్లాలో 1200 షెడ్లు, నంద్యాల జిల్లాలో 850 షెడ్లను ఏర్పాటు చేసుకునేందుకు వారం క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. వీటి నిర్మాణానికి ఉపాధి హామీ జాబ్ కార్డును తప్పనిసరి చేశారు. పశువుల షెడ్లకు 90 శాతం, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు 70 శాతం సబ్సిడీని అందిస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఎమ్మెల్యేలు చెబితేనే

పశుసంవర్ధక శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లాకు భారీ ఎత్తున మినీ గోకులం షెడ్లను కేటాయించింది. రాష్ట్రంలో అత్యధికంగా మినీ గోకులాల షెడ్లను కర్నూలు జిల్లాకు కేటాయించడం గమనార్హం. గతంలో టీడీపీ ప్రభుత్వం మినీ గోకులాల ఏర్పాటుకు పెద్ద ఎత్తున ఉపాధి హామీ పథకం ద్వారా నిధులను మంజూరు చేసింది. అదే రీతిలో ఈ సంవత్సరం కూడా మినీ గోకులాల షెడ్లను ఏర్పాటు చేసేందుకు ఉపాధి హామీ పథకం ద్వారా గోకులాల షెడ్లకు ఉత్తర్వులు జారీ చేశారు. అర్హులైన వారికే మినీ గోకులాల షెడ్లను ఇవ్వాలని ప్రభుత్వం స్పష్టంగా ఉత్తర్వుల్లో పేర్కొంది. స్థలంతో పాటు కచ్చితంగా రైతు, పాడి పశువులు ఉన్న వారికే గోకులం షెడ్లను కేటాయించాల్సి ఉంది. మరోవైపు ఉపాధి హామీ పథకంలో జాబ్ కార్డును కలిగి ఉండాలి. ఈ అర్హతలు ఉన్న వారందరికీ మినీ గోకులాలను సర్దుబాటు చేసేందుకు ప్రస్తుతం అధికారులు కుస్తీ పడుతున్నారు. అయితే.. ఎమ్మెల్యేలు పెద్ద ఎత్తున తమ వారికే ఇవ్వాలంటూ పశుసంవర్ధక శాఖ అధికారులపై ఒత్తిడి చేస్తున్నారు.





ఉమ్మడి కర్నూలు జిల్లాలో పశుసంపద వివరాలు

కర్నూలు జిల్లాలో 3.62 లక్షల గోజాతి పశువులు, 14.8 లక్షల గొర్రెలు, మేకలు, అదేవిధంగా 5.85 లక్షల కోళ్లు ఉన్నట్లు పశుసంవర్ధక శాఖ జేడీ శ్రీనివాసులు తెలిపారు. అదేవిధంగా నంద్యాల జిల్లాలో 4.14 లక్షల గోజాతి పశువులు, 11.89 లక్షల మేకలు, గొర్రెలు, 7.5 లక్షల కోళ్లు ఉన్నాయి.

గోకులం షెడ్లకు అందిస్తున్న సబ్సిడీ వివరాలు

పశువుల గోకులం సబ్సిడీ వివరాలు (రూ.లలో)

షెడ్డు పరిధి	వ్యయం	రాయితీ	లబ్ధిదారుని వాటా
రెండు పశువులు	1.15 లక్షలు	1,03,500	11,500
నాలుగు పవువులకు	1.85 లక్షలు	1,66,500	18,500
ఆరు మించి ఉంటే	2.30 లక్షలు	2,07,500	23,000
● గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లకు			
20 గొర్రెలు, మేకలకు	1.31 లక్షలు	91,000	39,000
50 దాటితే	2.30లక్షలు	1,61,000	69,000
100 కోళ్లు ఉంటే	87,000	60,900	26,100
200పైగా ఉంటే	1,32,000	92,000	39,600

ఉపాధి హామీ నిధులతో గోకులం షెడ్లు



మూగ జీవాలకు నిల్వ నీడ కల్పించేందుకు తెలుగుదేశం ప్రభుత్వం గోకులం పథకాన్ని అమలులోకి తెచ్చింది. కర్నూలు జిల్లాకు ఈ పథకం ద్వారా 1200 యూనిట్లు, నంద్యాల జిల్లాకు 850 యూనిట్లు ఏర్పాటు చేయాలని తలపెట్టింది. 70 నుంచి 90 శాతం సబ్సిడీతో వీటిని నిర్మించుకునేందుకు రైతులకు పాడిగేదెల పోషకులకు అవకాశం కల్పించింది. రైతులు, పాడి పశువుల పోషకులకు ఇది ఎంతో సువర్ణవకాశం. అర్హులైన వారు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

శ్రీనివాసులు, పశుసంవర్ధక శాఖ జేడీ, కర్నూలు



ఎమ్మెల్యేల సిఫారసు మేరకే గోకులం షెడ్లు

ప్రభుత్వం నంద్యాల జిల్లాకు 850 గోకులం షెడ్లను కేటాయించింది. 2,500 దాకా దరఖాస్తులు వచ్చాయి. అర్హతను బట్టి ఇచ్చేందుకు కూడా అవకాశం లేని పరిస్థితులు ఉన్నాయి. ఎమ్మెల్యేలు సిఫారసు చేసిన రైతులు, పాడిగేదెల యజమానులు ఇచ్చిన దరఖాస్తులనే పరిగణనలోకి తీసుకుని వాటిని నీటి యాజమాన్య సంస్థ అధికారులకు పంపుతున్నాం.

- మోహన్‌లాల్ నాయక్, జేడీ, నంద్యాల

గణపతి పూజలో మంత్రి టీజీ భరత్



వినాయక చవితి వేడుకల్లో మంత్రి టీజీ భరత్

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 8: నగరంలోని వివిధ ప్రాంతాల్లో కొలువు దీరిన వినాయక విగ్రహాలను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ శనివారం దర్శించుకున్నారు. ముందుగా రాంబొట్ల దేవాలయం వద్ద కొలువు దీరిన వినాయకుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం పాతబస్టాండ్‌లోని కురువ వీధిలో ఉన్న వినాయక విగ్రహం వద్ద పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ వరదల నుండి ప్రజలను రక్షించాలని వేడుకున్నట్లు తెలిపారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 8: కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్) కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ పి. రంజిత్ బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంతో పాటు అన్ని మండల కేంద్రాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లో, డివిజన్ స్థాయిలో కూడా ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం ఉంటుం దని అన్నారు.

వరద బాధితులకు 10వేల కిట్లు

మంత్రి టీజీ భరత్



సమావేశంలో మాట్లాడుతున్నతిక్కారెడ్డి

కర్నూలు(అర్బన్), సెప్టెంబరు 8: విజయవాడ వరద బాధితుల కోసం రూ. కోటితో పదివేల కిట్లు పంపిణీకి సిద్ధం చేశామని రాష్ట్ర మంత్రి టీజీ భరత్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి తెలిపారు. ఆదివారం మౌర్యఇన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లా తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గం ఇన్‌చార్జిలు, నాయకుల సహకారంతో పదివేల కిట్లు తయారు చేసినట్లు చెప్పారు. ఒక్క కిట్‌లో 5 కేజీల బియ్యం, ఒక కేజీ చక్కెర, ఉప్మారవ్వ, కారంపొడి తదితర నిత్యావసర వస్తువుల ప్యాక్‌చేసి పెట్టామన్నారు. మంగళవారం విజయవాడలో వీటిని పది వేల కుటుంబాలకు అందజేయనున్నట్లు తెలిపారు. వరద బాధితులకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి సహకారం అందించి పార్టీ కార్యకర్తలు, దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వై. నాగేశ్వరరావు యాదవ్ పాల్గొన్నారు.

శ్రీశైలం జలాశయం 8 గేట్లు ఎత్తివేత



శ్రీశైలం గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న నీరు

శ్రీశైలం, సెప్టెంబరు 8: శ్రీశైలం జలాశయానికి ఎగువ పరివాహక ప్రాంతాల నుంచి వరద ప్రవాహం కొనసాగుతోంది. ఆదివారం జలాశయానికి ఇన్‌ఫ్లో పెరగడంతో డ్యాం అధికారులు జలాశయం ఎనిమిది క్రస్టు గేట్లను తెరిచి దిగువ నాగార్జున సాగర్‌కు నీటిని విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి 1,69,839 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 35,832 క్యూసెక్కులు మొత్తం 2,05,660 వరద నీరు వస్తోంది. జలాశయం ఎనిమిది క్రస్టు గేట్లు ఎత్తి 2,19,096 క్యూసెక్కుల నీటిని దిగువ నాగార్జున సాగర్ జలాశయానికి విడుదల చేస్తున్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటల సమయానికి జలాశయానికి 2,88,232 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. శ్రీశైలం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 883.40 అడుగులుగా నమోదయింది. జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ 215.807 టీఎంసీలు కాగా ప్రస్తుత నీటి నిల్వ 206.9734 టీఎంసీలుగా నమోదయింది. ఆంధ్రప్రదేశ్ జల విద్యుత్ కేంద్రం ద్వారా 30,822 క్యూసెక్కులు, తెలంగాణ జల విద్యుత్ కేంద్రం ద్వారా 37116 క్యూసెక్కుల నీటితో విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నారు.



గతేడాది సెప్టెంబరు 9న అరెస్టు సమయంలో చంద్రబాబు

అరెస్టు నుంచి అసెంబ్లీకి..!



ఈ ఏడాది జూన్‌లో జరిగిన అసెంబ్లీ తొలి సమావేశాల్లో సీఎం చంద్రబాబు

- గత ఏడాది సెప్టెంబరు 9న నంద్యాలలో చంద్రబాబు అరెస్టు
- నాడు ఉప్పొంగిన జనాగ్రహానికి నేటితో ఏడాది..
- అక్రమ అరెస్టు తదనంతరం టీడీపీ కూటమికి చారిత్రక విజయం

కర్నూలు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): **2023 సెప్టెంబరు 9.. సరిగ్గా ఇదే రోజు టీడీపీ అధినేత, అప్పటి ప్రతిపక్షనేత చంద్రబాబును జగన్ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేసింది. నంద్యాల పర్యటనలో భాగంగా చంద్రబాబు బస చేసిన ఆర్కే ఫంక్షన్ హాలును అర్ధరాత్రి ఆనాటి డీఐజీ రఘురామిరెడ్డి నేతృత్వంలో పోలీసు బలగాలు చుట్టుముట్టి అరెస్టు చేసి హంగామా సృష్టించాయి. ప్రత్యేక విమానంలో విజయవాడకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా.. చంద్రబాబు ససేమిరా అన్నారు. తప్పని పరిస్థితుల్లో రోడ్డు మార్గంలో చంద్రబాబును విజయవాడకు తరలించారు. అడుగడుగునా చంద్రబాబును తరలిస్తున్న పోలీసు కాన్వాయ్‌కి ప్రజలు అడ్డుపడ్డారు.**

కట్టలు తెంచుకున్న ఆగ్రహం.. 52 రోజులు నిరసనలు

గతేడాది సెప్టెంబరు 9న అర్ధరాత్రి జగన్ ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ కేసు పేరిట అక్రమంగా అరెస్టు చేయడాన్ని ప్రజలు జీర్ణించుకోలేకపోయారు. జనాగ్రహం ఉప్పొంగి కట్టలు తెంచుకుంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోనే గాక యావత్ భారతావనిలో చంద్రబాబు అరెస్టును తెలుగువారు ముక్తకంఠంతో ఖండించి వివిధ రూపాల్లో నిరసనలు తెలిపారు. దాదాపు 53 దేశాలలో చంద్రబాబుకు మద్దతుగా.. అక్రమ అరెస్టుకు వ్యతిరేకంగా.. నాటి జగన్ ప్రభుత్వం చేసిన తప్పిదాన్ని వ్యతిరేకిస్తూ నిరసనలు, ఆందోళనలు చేపట్టారు. ఉమ్మడి కర్నూలు, నంద్యాల జిల్లాల్లో పల్లె మొదలు పట్నం దాకా టీడీపీ శ్రేణులతోపాటు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు, నిరుద్యోగులు, సామాన్య ప్రజలు, తటస్థులు, మహిళలు చంద్రబాబుకు అండగా నిలిచారు. అరెస్టును నిరసిస్తూ రోజుకోరీతిలో ఆందోళనలు చేశారు. బాబు జైలుకెళ్లిన నాటి నుంచి నిర్బంధం నుంచి విడుదలై వచ్చేదాకా 52 రోజులు నిరసనలతో హోరెత్తించారు. కర్నూలు, కోడుమూరు, ఎమ్మిగనూరు, మంత్రాలయం, ఆదోని, ఆలూరు, పత్తికొండ, పాణ్యం, డోన్, బనగానపల్లె, నంద్యాల, ఆళ్లగడ్డ, శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో అప్పటి టీడీపీ ఇన్‌చార్జిల ఆధ్వర్యంలో ప్రజలు నిరసనలతో హోరెత్తించారు. చంద్రబాబు అరెస్టు ఆనాటి జగన్ ప్రభుత్వం చేసిన అతి పెద్ద రాజకీయ తప్పిదం అంటూ మేధావులు విశ్లేషించారు.



నంద్యాలలోని ఆర్కే ఫంక్షన్ హాల్ వద్ద ఉద్రిక్తత (ఫైల్)

బాబు అరెస్టుతో.. టీడీపీకి చారిత్రాత్మక విజయం

చంద్రబాబును అప్పటి వైసీపీ ప్రభుత్వం అరెస్టు చేయడంతో టీడీపీతో ప్రజలకు మరింత అనుబంధం పెరిగింది. అప్పటి వరకు నిస్తేజంగా ఉన్న టీడీపీ శ్రేణులు సైతం చంద్రబాబునే అరెస్టు చేస్తారా..! అంటూ గర్జించారు. ప్రభుత్వ వ్యతిరేక విధానాలు, చంద్రబాబు అక్రమ అరెస్టు తీరు.. టీడీపీ విధానాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లారు. అన్ని వర్గాల ప్రజలు చంద్రబాబు అరెస్టుపై ఒక్కసారిగా కన్నీళ్లు పెట్టారు. అక్రమ అరెస్టుతో 52 రోజులు జైలులో ఉన్న చంద్రబాబు బయటకు వచ్చాక రెట్టింపు ఉత్సాహంతో జనంలోకి వెళ్లారు. తప్పు చేయలేదంటూ జనానికి వివరించారు. ప్రజలు అధినేతకు అండగా నిలిచారు. మేలో జరిగిన ఎన్నికల్లో ఓటెత్తారు. వైసీపీ ప్రభుత్వానికి ఊహించని గుణపాఠం చెప్పారు. టీడీపీ కూటమిని 164 స్థానాల్లో గెలిపించి చారిత్రాత్మక విజయాన్ని అందించారు. ఉమ్మడి జిల్లాల్లో కర్నూలు, నంద్యాల పార్లమెంటు స్థానాలతో పాటు 12 అసెంబ్లీ నియోజకవర్గాల్లో టీడీపీకి పట్టం కట్టారు. 1983లో టీడీపీ ఆవిర్భావం తర్వాత జరిగిన ఎన్నికల్లో ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఈ స్థాయిలో విజయం అందించడం ఇదే ప్రథమం. అందుకు ప్రధాన కారణం చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేయడాన్ని ప్రజలు జీర్ణించుకోకపోవడమే. నంద్యాలలో అరెస్టు తర్వాత.. అఖండ విజయంతో చంద్రబాబు ముఖ్యమంత్రిగా అసెంబ్లీలో అడుగు పెట్టారు. చేసిన శపథం నెరవేర్చుకున్నారు.

నాడు చంద్రబాబు ఏమన్నారంటే..

గత 45 ఏళ్లుగా తెలుగు ప్రజల కోసం నిస్వార్థంగా సేవ చేశాను.. తెలుగు ప్రజల ప్రయోజనాల కోసం నేను ప్రాణత్యాగానికైనా సిద్ధం.. భూమ్మీద ఏ శక్తి కూడా నన్ను తెలుగు ప్రజలకు, ఆంధ్రప్రదేశ్‌కు సేవ చేయకుండా ఆపలేదు.. అని అరెస్టు సందర్భంగా చంద్రబాబు అన్నారు.



భారీ బందోబస్తు మధ్య అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబును అరెస్టు చేసి తీసుకెళ్తున్న సీఐడీ పోలీసులు



తుంగభద్రకు పెరుగుతున్న వరద

- నదికి 24,210 క్యూసెక్కుల నీరు విడుదల
- నేడు టీబీపీ డ్యాంకు నిపుణుల కమిటీ

కర్నూలు, సెప్టెంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల జీవనాడి తుంగభద్ర జలాశయానికి వరద పెరుగుతోంది. డ్యాం ఎగువన పడమటి కనుమల్లో కురుస్తున్న వర్షాలకు వరద జలాశయానికి చేరుతోంది. గరిష్ఠ నీటి మట్టం 1633 అడుగులు, సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా, ఆదివారం సాయంత్రానికి 1632 అడుగుల లెవెల్‌లో 101.77 టీఎంసీలు నీటి నిల్వ చేశారు. జలాశయంలోకి 35,001 క్యూసెక్కులు వరద వచ్చి చేరుతోంది. 10 గేట్లెత్తి 24,210 క్యూసెక్కులు దిగువ శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు. అదే క్రమంలో 10,791 క్యూసెక్కులు వివిధ కాలువలకు వదులుతున్నారు. డ్యాం నుంచి దిగువకు నీరు విడుదల చేయడంతో కర్నూలు జిల్లాలో ఆర్డీఎస్ ఆనకట్టపై వరద పొంగి ప్రవహిస్తున్నది. సుంకేసుల జలాశయానికి 30వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. గరిష్ఠ నీటి నిల్వ 1.2 టీఎంసీల నిల్వ ఉంచి వచ్చిన వరదను వచ్చినట్లుగా శ్రీశైలానికి విడుదల చేస్తున్నారు.

నేడు టీబీపీ డ్యాంకు నిపుణుల కమిటీ

తుంగభద్ర డ్యాం 19వ నెంబర్ గేట్ గత నెల 10వ తేదీన కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. సీఎం చంద్రబాబు ఆదేశాలతో క్రస్ట్ గేట్ల నిపుణుడు కన్నయ్య నాయుడు ఆధ్వర్యంలో తెగిపోయిన గేట్ల స్థానంలో స్టాఫ్‌లాగ్ ఎలిమెంట్స్ ఏర్పాటు చేసి దాదాపు 75 టీఎంసీల నీటిని కడలిపాలు కాకుండా కాపాడగలిగారు. ఆ తర్వాత వరద పెరిగి 101 టీఎంసీలకు వరద చేరింది. అయితే.. కొట్టుకుపోయిన 19వ గేటుతో పాటు మిగిలిన 32 గేట్ల భద్రతపై అధ్యయనం కోసం నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఆరుగురు సభ్యుల నిపుణుల కమిటీని నియమించిన విషయం తెలిసిందే. సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ ఏకే బజాజ్ నేతృత్వంలో హైడ్రో మెకానికల్, ఎలక్ట్రికల్ ఎక్స్‌పర్ట్స్ రిటైర్డు మెకానికల్ ఇంజనీర్లు హర్కేష్ కుమార్, ఆదోనికి చెందిన తారాపురం సుధాకర్‌తో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ ప్రతినిధులతో నిపుణుల కమిటీని నియమించారు. ఈ కమిటి నేడు డ్యాంను సందర్శించనుంది. 9, 10 తేదీలలో సమగ్రంగా అధ్యయనం చేసి ఆ నివేదికను సీడబ్ల్యూసీ తుంగభద్ర ప్రాజెక్టు బోర్డుకు అందజేస్తుంది.

బియ్యం స్వాధీనం.. వాహనాల సీజ్

తుగ్గలి, సెప్టెంబరు 8: అక్రమంగా బియ్యాన్ని తరలిస్తున్న ఐచర్ లారీని పోలీసులు అదుపులోకి తీసుకుని బియ్యంతో పాటు ఐచర్, కారును సీజ్ చేసినట్లు పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని పగిడిరాయి, జొన్నగిరి గ్రామాల మధ్య అక్రమంగా తరలిస్తున్న బియ్యం లారీని ఎక్సైజ్ పోలీసులు, జొన్నగిరి పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి లారీతో పాటు ఓ కారును కూడా స్వాధీనం చేసుకుని నలుగురుపై కేసు నమోదు చేశారు. 11 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకోవడంతో పాటు ఐచర్ లారీ, కారును సీజ్ చేసి శంకర్, సురేష్, శివప్రసాద్‌లను అదుపులోకి తీసుకున్నామన్నారు. ఈయన వెంట ఎక్సైజ్ ఎస్ఐ కార్తీక్ సాగర్, ఏఎస్ఐ రంగస్వామి, హెడ్ కానిస్టేబుల్ జయన్న, పోలీసు సిబ్బంది ఉన్నారు.

కూలిన మట్టి మిద్దెలు

మహిళకు విరిగిన రెండు కాళ్లు

వెల్దుర్తి, సెప్టెంబరు 8: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు మట్టి మిద్దె కూలి, మహిళకు రెండు కాళ్లు విరగడంతోపాటు, చేయికి తీవ్రగాయమైంది. ఈ ఘటన వెల్దుర్తి మండలంలో చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి రామళ్ళకోట గ్రామం దాసరివీధిలో మట్టి మిద్దె కూలిపోయి ఇంట్లో ఉన్న జైనుబ్ బీ మీద పడడంతో రెండు కాళ్లు విరిగిపోయాయి. చేతికి తీవ్రగాయమైంది. హుటాహుటిన భర్త నడిపెన్న చుట్టుపక్కల వారి సహాయంతో వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లాడు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు. ఇల్లు కూలిపోవడంతో రూ.1లక్ష ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. వెల్దుర్తి ఎస్ఐ అశోక్ శనివారం రూ.5 వేలు ఆర్థిక సాయం అందజేశారు. అలాగే వెల్దుర్తి పట్టణంలో 2వవార్డులో సువర్ణమ్మకు చెందిన మట్టిమిద్దె కూలిపోయింది. వరండా, వంటగది కూలిపోయాయి. ఈ ఘటనలో కోడిపిల్లలు చనిపోయాయి. సుమారు రూ.లక్షన్న ర నష్టం వాటిల్లినట్లు బాధితురాలు తెలిపింది. ఆ సమయంలో ఇంట్లో వ్యక్తులు బయటికి పరుగులు తీయడంతో పెను ప్రమాదం తప్పింది.



కూలిన మట్టి మిద్దె

అలాగే మండల పరిధిలోని లింగాలపల్లెలో రాజు, నాగరాజుకు చెందిన మట్టి మిద్దెలు కూలిపోయాయి. ఆ సమయంలో కుటుంబసభ్యులందరూ పొలం పనులకు వెళ్లడంతో ప్రాణనష్టం సంభవించలేదు. ఒక్కొక్కరికి రూ.1లక్ష నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు.

సాగుకు సహకార కేంద్ర బ్యాంకు ద్వారా రూ.330 కోట్ల రుణం

సీఈవో విజయకుమార్

కర్నూలు(అగ్రికల్చర్), సెప్టెంబరు 8: ప్రతి సంవత్సరం వివిధ జిల్లాల్లో రైతులు పొలాలను అభివృద్ధి చేసుకునేందు కోసం, పంట సాగు కోసం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు తక్కువ వడ్డీకే రుణాలను అందిస్తోందని, ఈ అవకాశాన్ని అర్హులైన రైతులంతా వినియోగించుకోవాలని జిల్లా సహకార కేంద్ర బ్యాంకు సీఈవో విజయకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో రైతులకు పంట రుణాలు అందించేందు కోసం ఆప్కాబ్ రూ.330 కోట్ల నిధులను విడుదల చేసిందని, ఇందులో రూ.20 కోట్లు రైతులు సాగు చేసే పంటలకు అవసరమైన పెట్టుబడి కోసం రూ.20 కోట్లు అందించనున్నామన్నారు. ఈ రుణాలను ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా రైతులకు అందిస్తున్నామన్నారు. అదే విధంగా సీసీఆర్సీ కార్డులు పొందిన కౌలు రైతులకు రూ.10 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

ఆళ్లగడ్డ/ప్యాపిలి, ప్రత్తిపాడు, సెప్టెంబరు 8 : వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందారు.



కాంతమ్మ(ఫైల్)



జగదీశ్వరరెడ్డి(ఫైల్)

- ఆళ్లగడ్డ మండలం పేరాయిపల్లె మెట్ట వద్ద శనివారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో తల్లీ కొడుకు మృతి చెందారు. హైదరాబాదు నుంచి కడప జిల్లా వేంపల్లి మండలం నందిపల్లెకు మోటారు సైకిల్‌పై కాంతమ్మ, జగదీశ్వరరెడ్డి, వెంకటసుబ్బారావు వెళ్తుండగా పేరాయిపల్లె మెట్ట వద్ద ముందు వెళ్తున్న ఐషర్ లారీని వెనుక నుంచి ఢీ కొట్టడంతో కాంతమ్మ(40), ఆమె కుమారుడు జగదీశ్వరరెడ్డి(17) అక్కడికక్కడే మృతి చెందగా, వెంకటసుబ్బారావు గాయాలతో బయట పడ్డాడని రూరల్ ఎస్ఐ హరిప్రసాదు చెప్పారు. మృత దేహాలను నిమిత్తం ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ చెప్పారు.
- ప్యాపిలి మండలంలోని పోతుదొడ్డి గ్రామం సమీపంలో 44వ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో హైవే పెట్రోలింగ్ వాహనం డ్రైవర్ రాముడు(34) మృతి చెందాడు. పోతుదొడ్డి గ్రామం వద్ద హైవేపై ఇంజన్‌లో సమస్య రావడంతో ఓ లారీ నిలబడిపోయింది. దీంతో వాహనాల రాకపోకలు స్తంభించిపోవడంతో పోలీసులు సమాచారం మేరకు పెట్రోలింగ్ వాహనం సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. నిలబడిపోయిన లారీని పరిశీలిస్తుండగా కర్నూలు నుంచి అనంతపురం వైపు వెళ్లుతున్న లారీ అతి వేగంతో రాముడిని ఢీకొట్టింది. దీంతో రాముడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు కర్నూలు జిల్లా వెల్దుర్తి పట్టణానికి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.
- గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం బోయపాలెం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నంద్యాల జిల్లాకు చెందిన వ్యక్తి అక్కడికక్కడే మరణించారు. నంద్యాల జిల్లా ప్యాపిలి మండలం పోతుదొడ్డి గ్రామానికి చెందిన మరమోసి బాబు విజయవాడ నుంచి అనంతపురానికి వ్యానును తీసుకుని బయలు దేరాడు. ఆదివారం తెల్లవారుజామున ముందు వెళుతున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి వెనుక నుంచి ఢీకొనడంతోపాటు పక్కనే ఉన్న మరో లారీని ఢీ కొన్నాడు. ఈ ప్రమాదంలో వ్యాను డ్రైవర్ బాబు అక్కడి కక్కడే మరణించగా, ట్రాక్టర్ డ్రైవర్‌కు గాయాలు అయ్యాయి. ప్రత్తిపాడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జిల్లా కాంగ్రెస్‌కు కొత్త సారథిగా మురళీకృష్ణ

కర్నూలు (అర్బన్), సెప్టెంబరు 8: జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా మాజీ ఎమ్మెల్యే పరిగెల మురళీకృష్ణ నియమితులయ్యారు. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నియమించారు. నగర అధ్యక్షుడిగా షేక్ జిలానీ బాషాను నియమించారు. గతంలో పని చేసిన జిల్లా అధ్యక్షుడు కే. బాబురావు, నగర అధ్యక్షుడు జాన్ విల్సన్‌ల స్థానంలో కొత్త వారిని నియామకం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ వైఎస్ షర్మిలారెడ్డి, జాతీయ, రాష్ట్ర నాయకులకు కార్యకర్తలకు వీరు కృతజ్ఞతలు తెలిపారు.



మురళీకృష్ణ

వరుసగా మూడోసారి ఎంపిక

నంద్యాల టౌన్, సెప్టెంబరు 8 : నంద్యాల డీసీసీ అధ్యక్షుడిగా జె.లక్ష్మీ నరసింహ యాదవ్‌ను వరుసగా మూడోసారి ఏఐసీసీ నియమించింది. రాష్ట్రంలోని 25 జిల్లాలకు డీసీసీ అధ్యక్షులను, 6 నగరాలకు కాంగ్రెస్ అధ్యక్షు లను నియమిస్తూ ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, ఎంపీ కేసీ వేణుగోపాల్ అధికారిక ఉత్తర్వులను జారీ చేశారు. ఇందులో భాగంగా నంద్యాల డీసీసీ అధ్యక్షుడిగా లక్ష్మీనరసింహయాదవ్‌ను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు.



లక్ష్మీ నరసింహ యాదవ్

హైడ్రా కూల్చిన భవనంతో నాకు సంబంధం లేదు..

పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు, సెప్టెంబరు 8: హైదరాబాద్‌లో హైడ్రావారు కూల్చిన భవనంతో తనకు ఎటువంటి సంబంధం లేకున్నా.. తనను ఇరికించాలని చూస్తున్నారని పాణ్యం మాజీ ఎమ్మెల్యే, నంద్యాల వైసీపీ జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం కల్లూరు చెన్నమ్మసర్కిల్లోని తన స్వగృహంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ హెచ్ఎండీఏ, ఇరిగేషన్ అధికారులు తన భూమి ఎఫ్‌టీఎల్ పరిధిలో లేదని స్పష్టం చేశారని, అయినా నోటీసులు ఇవ్వకుండా పోలీసులు, అధికారులు దౌర్జన్యంగా తమ నిర్మాణాలు కూల్చారని కాటసాని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ అంశంపై న్యాయపరంగా ముందుకు వెళతామని మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి తెలిపారు.



మూడు దుకాణాల్లో చోరీ

షట్టర్ తాళాలను పగలగొట్టి రూ.1.40 లక్షలు దోచుకెళ్లిన దొంగలు

ఎమ్మిగనూరు, సెప్టెంబరు 8: ఎమ్మిగనూరు పట్టణంలోని శివసర్కిల్‌లో శుక్రవారం రాత్రి మూడు దుకాణాల్లో దొంగలు చోరికి పాల్పడ్డారు. శివసర్కిల్‌లో ఉన్న ఎంఆర్ఎఫ్ షోరూం, రెయిన్‌బో దుస్తుల దుణం, పార్సల్ పాయింట్ దుకాణాల షట్టర్లకు ఉన్న తాళాలను పగులగొట్టి లోపల ఉన్న అద్దాలను ధ్వంసం చేసి దుకాణాల్లోకి చొరబడ్డారు. ఈ దుకాణాల్లో ఉన్న నగదును దోచుకెళ్లారు. దుకాణ యజమానులు శనివారం ఉదయం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం తెలుసుకున్న పట్టణ పోలీసులు చోరీకి గురైన దుకాణాలను పరిశీలించి బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. చోరీలో దాదాపు రూ. 1.40 లక్షలు అపహరణకు గురైనట్లు పోలీసులు, బాధితులు తెలిపారు. దొంగల కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

మల్లన్న సన్నిధిలో ఏపీ సమాచార కమిషనర్



ఆలయ ప్రాంగణంలో కమిషనర్ చావలి సునీల్

శ్రీశైలం, సెప్టెంబరు 8: శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి, అమ్మవార్లను ఆదివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమాచార కమిషనర్ చావలి సునీల్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. రాజగోపురం వద్ద వీరికి ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం కమీషనర్ చావలి సునీల్ స్వామి వారిని, అమ్మవారిని దర్శించుకుని అభిషేకం, అర్చనలు జరిపించు కున్నారు. కమిషనర్‌ను అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలను అందజేశారు.

వ్యక్తి దారుణ హత్య

కర్నూలు, సెప్టెంబరు 8: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎల్కూరు బంగ్లా సమీపంలో లోకేశ్ (34) అనే వ్యక్తిని కొందరు కత్తులతో పొడిచి హత్య చేశారు. శనివారం ఈ దాడి జరుగగా.. తీవ్రంగా గాయపడిన లోకేష్ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీలో ఉండే లోకేశ్ అనే వ్యక్తి తన భార్యతో అసభ్యకరంగా ప్రవర్తించాడని అశోక్.. తన స్నేహితుడు జగదీష్‌తో కలిసి ఈ హత్యకు పాల్పడ్డాడు. లోకేశ్ తన తల్లితో వీకర్ సెక్షన్ కాలనీలో నివాసముంటున్నాడు. ఇతనికి భార్య, కొడుకు, ఒక కూతురు సంతానం ఉంది. లోకేశ్‌తో విభేదాలు రావడంతో భార్య గొడవపడి పుట్టింటికి వెళ్లిపోయింది. గత కొద్ది కాలంగా లోకేశ్ మతిస్థిమితం లేకుండా తిరుగుతున్నాడు. గతంలో విశాఖపట్నంలో ట్రీట్‌మెంట్ ఇప్పించారు. ఆ తర్వాత కర్నూలులో తల్లితో నివాసముంటున్నాడు. శనివారం రాత్రి యేల్కూరు బంగ్లా సమీపంలో ఉన్న అశోక్ భార్యతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. అతని ప్రవర్తనకు భయపడి అశోక్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. లోకేశ్ అశోక్‌ను వెంబడించాడు. అశోక్ తన స్నేహితుడు జగదీష్‌తో కలిసి లోకేశ్‌పై కత్తులతో దాడి చేసి నరికాడు. స్థానికులు రావడంతో ఇద్దరు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కొంత మంది లోకేశ్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్పించారు. ఆసుపత్రిలో కోలుకోలేక ఆదివారం మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి

ఉయ్యాలవాడ, సెప్టెంబరు 8: మండలంలోని సర్వాయిపల్లె గ్రామానికి చెందిన లింగం చిన్న కర్రెన్న కుమారుడు కళ్యాణ్(12) ఈతకు వెళ్లి మృతి చెందాడు. శనివారం ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన కళ్యాణ్ తన మిత్రలతో కలిసి ఉదయం గ్రామ సమీపంలోని బావిలో ఈతకు వెళ్లి అందులో గల్లంతయ్యాడు. గ్రామస్తులు అక్కడికి చేరుకొని బాలుడిని బయటకు తీశారు. కుటుంబసభ్యులు ఆళ్లగడ్డ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి బాలుడు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కళ్యాణ్ ఉయ్యాలవాడలోని ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. బాలుడి తల్లిదండ్రులకు పాఠశాల యాజమాన్యం రూ. 20 వేలు ఆర్థిక సాయం అందించింది. కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపారు.



కళ్యాణ్ (ఫైల్)

డోన్‌లో విషాదం

విద్యుదాఘాతానికి యువకుడి మృతి

డోన్(రూరల్), సెప్టెంబరు 8: డోన్ పట్టణంలో వినాయక చవితి పండుగ రోజున విషాదం నెలకొంది. పట్టణంలోని తారకరామ నగర్‌లో శనివారం రాత్రి పడుతున్న వర్షానికి వినాయక మండపానికి కవర్ కప్పే ప్రయత్నంలో కమ్మరి కౌశిక్ (25) అనే యువకుడు విద్యుదాఘాతానికి గురై కింద పడ్డాడు. స్నేహితులు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. పండుగ పూట యువకుడు మృతి చెందడంతో విషాదం నెలకొంది.

రేపు జూనియర్ కళాశాలలో జాబ్ మేళా

కోడుమూరు (రూరల్), సెప్టెంబరు 8: కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 10న జాబ్‌మేళా నిర్వహిస్తారని ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ అధ్వర్యంలో జాబ్‌మేళా జరుగుతున్నట్లు తెలిపారు. జాబ్‌మేళాలో జెప్టో, ఎల్‌అండ్‌టీ ఫైనాన్స్, యురేక ఫోర్బ్స్, స్విగ్గీ వంటి ప్రముఖ కంపెనీలు అవకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ విద్యార్హత కలిగి 18-30 ఏళ్ల వయస్సు ఉన్న యువతీ యువకులు అర్హులని అన్నారు.

10న జిల్లాలో పంటల పరిశీలన

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 7: ఏపీ రైతుసంఘం అధ్వర్యంలో 10న జిల్లాలో పంటల పరిశీలన చేయనున్నట్లు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్నగౌడు తెలిపారు. ఆదివారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల బ్యాంకుల్లో తీసుకున్న పంట రుణాలు మాఫీ చేయాలన్నారు. రబీ సీజన్లో వేసుకోబోయే పంటలకు ఉచితంగా విత్తనాలు, ఎరువులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటల పరిశీలనకుకు రైతు సంఘం బృందం కర్నూలు నుంచి బయలుదేరి కోడుమూరు, గోనెగండ్ల, ఎమ్మిగనూరు, ఆదోని, ఆస్పరి, పత్తికొండ, దేవనంకొండ ప్రాంతాలలో పర్యటిస్తారన్నారు. పంటల పరిశీలనకు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి.రామచంద్రయ్య, రాష్ట్ర కార్యదర్శి కే.జగన్నాథం, సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య పాల్గొంటారని తెలిపారు.

జీవో నెం.115ను రద్దు చేయాలి

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 8: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో పని చేస్తున్న కాంట్రాక్టు స్టాఫ్ నర్సులను రెగ్యులర్ చేయాలని టీఎన్‌టీయుసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్‌ను కర్నూలు జీజీహెచ్ కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు కోరారు. ఆదివారం నగరంలోని ఆఫీసులో ఆయన తెలుగు నాడు మెడికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ నాయకులు, కాంట్రాక్టు స్టాఫ్ నర్సులతో విస్తృత స్థాయి జరిగింది. కొవిడ్ కష్టకాలంలో కాంట్రాక్టు స్టాఫ్ నర్సులు తమ ప్రాణాలను అడ్డుపెట్టి రోగులను కాపాడారని తెలుగునాడు వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాధవరాజు, బంగారి, టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దృష్టికి తెచ్చారు. ఏఎన్‌ఎంలుగా పని చేస్తున్న వారికి జీఎన్‌ఎంగా శిక్షణ ఇచ్చి ఖాళీ స్టాఫ్ నర్సుల పోస్టులో నియామకాలను అవకాశం కల్పించే జీవో.నెంబర్.115ను రద్దు చేయాలని కోరారు. కొవిడ్ సమయంలో తమ కుటుంబాలను త్యాగం చేసి ప్రజల ప్రాణాలను కాపాడడంతో ప్రధాన పాత్ర పోషించారని, అటువంటి వారికి సీఎం చంద్రబాబు ఆదుకుంటారని టీఎన్‌టీయుసీ ప్రధాన కార్యదరిశ్శి అశోక్ కుమార్, కాంట్రాక్టు స్టాఫ్ నర్సులకు తెలియజేశారు. కార్యక్రమంలో తెలుగునాడు మెడదికల్ అండ్ హెల్త్ అసోసియేషన్ నాయకురాలు శాంతిభవాని, శాంతిలత, సుజాత పాల్గొన్నారు.

మోదీ విధానాలను వ్యతిరేకించండి

● సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్



మాట్లాడుతున్న ఎంఏ గఫూర్

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 8: ప్రధాని నరేంద్ర మోదీ విధానాలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక కొత్తబస్టాండు వద్ద ఉన్న కార్మిక కర్షక భవన్‌లో సీపీఎం జిల్లా విస్తృత స్థాయి సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.రామాంజనేయులు అధ్యక్షతన నిర్వహించారు. గఫూర్ మాట్లాడుతూ ప్రపంచంలో యుద్ధోన్మాదం పెచ్చరిల్లుతోందని మానవహింసను తగ్గించడం కోసం దేశాధినేతలు చర్చల ద్వారా పరిష్కారం చేసుకోవాలని సీపీఎం కోరుతుందన్నారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ దాడితో పాటు ఉక్రెయిన్, రష్యాల యుద్ధం కూడా ప్రారంభమైందన్నారు. ఎక్కడ యుద్ధాలు జరిగినా పసిపిల్లలు, మహిళలు మారణహోమంలో బలవుతున్నారన్నారు. ప్రధాని మోదీ మాత్రం ఉక్రెయిన్‌కు వెళ్లి యుద్ధాన్ని ఆపినట్లుగా ఫోజులు పెడుతున్నారన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే.ప్రభాకర్ రెడ్డి, కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, సభ్యులు పీఎస్ రాధాకృష్ణ, పి. నిర్మల, జి.రామకృష్ణ, కేవీ నారాయణ, ఎండీ ఆనందబాబు, ఎండీ అంజిబాబు, అరుణమ్మ, అలివేలమ్మ, టి.రాముడు, ఎం.రాజశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా 'కోల్స్ సెంటీనియల్' వార్షికోత్సవాలు



పోటీలను ప్రారంభిస్తున్న సంఘం పెద్దలు

కర్నూలు (స్పోర్ట్స్), సెప్టెంబరు 8: స్థానిక కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చి 106వ వార్షికోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులకు 7 నుంచి 10వ తేదీ వరకు క్రీడ పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు ఏడీఏ లింకన్, చర్చి ఫాస్టర్ రెవ.ఆర్.అనిల్ శ్యామేల్, రెవ.జీవన్‌రావు తెలిపారు. ఈ మేరకు పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. నిర్వాహకులు పి.దినకర్, ప్రవీణ్ మాట్లాడుతూ జూనియర్స్, సీనియర్స్ వెటరన్స్ విభాగాలలో వాలీబాల్, మినీ ఫుట్‌బాల్, త్రోబాల్, టెన్నికాయిట్, క్యారమ్స్, షార్ట్, క్రికెట్, రన్నింగ్ రేస్‌లను నిర్వహిస్తున్నామన్నారు. కన్వీనర్లు విజయకుమార్, సుధీర్, జయకుమార్, మధుకర్, నీరజ్, నరేష్‌లు క్రీడలను పర్యవేక్షిస్తారని తెలిపారు.

సమాజ అభివృద్ధికి విద్య అవసరం

ఓర్వకల్లు, సెప్టెంబరు 8: సమాజ అభివృద్ధికి విద్య ఎంతో అవసరమని వయోజన విద్యాశాఖ ఉప సంచాలకులు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం ఓర్వకల్లులోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

29న నగర బ్రాహ్మణ సంఘానికి ఎన్నికలు

కర్నూలు(కల్చరల్), సెప్టెంబరు 8: నగర బ్రాహ్మణ సంఘం ఎన్నికలు ఈనెల 29న నిర్వహిస్తున్నట్లు సంఘ ఎన్నికల అధికారిగా నియమితులైన కళ్లే వేణుగోపాల్ శర్మ ప్రకటించారు. ఆదివారం నగరంలోని సంకల్‌బాగ్‌లో గల హరిహర క్షేత్రంలో నగర బ్రాహ్మణ సంఘం సభ్యుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సభ్యులు ఎన్నికల అధికారిగా కళ్లే వేణుగోపాల్ శర్మను సభ్యులు ఏకగ్రీవం చేస్తూ పలు తీర్మానాలు ఆమోదించారు. ఈ సందర్భంగా సభ్యత్వ నమోదు పత్రాలను వారు విడుదల చేశారు. అనంతరం కళ్లే వేణుగోపాల్ శర్మ మాట్లాడుతూ నగర బ్రాహ్మణ సంఘం నూతన కమిటీ (2024-2027) ఎన్నికలు 29న ఉదయం 8 గంటల నుంచి ఉంటాయని అన్నారు. సమావేశంలో బ్రాహ్మణ సంఘ సభ్యులు చల్లా నాగరాజ శర్మ, కంచుగంటల శ్యామసుందర శర్మ, సండేల్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థి కష్టపడి చదవాలి



మాట్లాడుతున్న ఏపీఎస్పీ డీఎస్పీ మహబూబ్ బాషా

కర్నూలు(కలెక్టరేట్), సెప్టెంబరు 8: ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని ఏపీఎస్పీ డీఎస్పీ మహబూబ్ బాషా అన్నారు. ఆదివారం నగరంలోని టీజీ వెంకటేశ్ లలితా కళాక్షేత్రంలో బీ.క్యాంపు సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమం జరిగింది. డీఎస్పీ మాట్లాడుతూ విద్యార్థి ఒక గమ్యం ఏర్పరుచుకుని ఆ దిశగా అడుగులు వేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ కాంత్ కుమార్, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ బాబు, వీర ప్రకాష్, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఎరుకల రాజు, డా.రాజన్న, నాగరాజు, వెంకటేశ్, వెంకటరెడి పాల్గొన్నారు.

ఘనంగా గణపయ్య పండుగ




ఓర్వకల్లులో వినాయకునికి పూజలు చేస్తున్న భక్తులు

గణనాథుడి పండుగతో ఊరూవాడా సందడిగా మారింది. మండపాల వద్ద భక్తుల రద్దీ కనిపించింది. కర్నూలు జిల్లా వ్యాప్తంగా శనివారం వినాయక చవితి వేడుకలను భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని పలు కూడళ్ల వద్ద, ఆలయాల్లో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేసి విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. వినాయకునికి నైవేద్యంగా ఉండ్రాళ్లు, కుడుములు సమర్పించి వినాయక వ్రత కల్పం, 21రకాల పత్రాలతో పూజలు, అర్చనలు, హారతులు ఇచ్చారు.

● వాడవాడలా కొలువుదీరిన ఉత్సవ గణనాథులు

● సందడిగా సాంస్కృతిక కార్యక్రమాలు



కర్నూలులోని మంత్రాలయం మఠం వద్ద పూజలందుకుంటున్న గణనాథుడు

కోడుమూరు, సెప్టెంబరు 8: వినాయక చవితి పండుగ పురస్కరించుకొని కోడుమూరు పట్టణంలో ఎక్కడ చూసిన వినాయకుడు వివిధ రూపాల్లో కొలువై భక్తుల చేత పూజలు అందుకొన్నాడు. పట్టణంలో వీధివీధిన గణపయ్య విగ్రహాలను ఏర్పాటు చేశారు. విగ్రహాలను తిలకించెందుకు భక్తులు పోటెత్తారు. పట్టణంలో దాదాపు 120 గణపతి విగ్రహాలు కొలువైయ్యాయి.

నేడు వినాయక నిమజ్జనం : మూడు రోజుల పాటు పూలలు అందుకొన్న గణేషుడు సోమవారం సాయంత్రం నిమజ్జం చేసెందుకు భక్తులు సిద్ధం అయ్యారు. మధ్యాహ్నం 3గంటల నుంచి విగ్రహాల ఊరేగింపు ప్రారంభించాలని సీఐ తబ్రేజ్, ఎస్ఐ ఏపీ శ్రీనివాసులు మండప నిర్వాహకులకు గట్టి హెచ్చరికలు చేశారు. సూచించిన వరుస క్రమంలో విగ్రహాలు ఊరేగింపులో పాల్గొనాలని పోలీసులు తెలిపారు

ముస్తాబు అవుతున్న గణేష్ నిమజ్జన ఘాట్ : గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని వెల్దుర్తి రోడ్ వైపు ఉన్న గణేష్ నిమజ్జన ఘాట్‌ను సిద్ధం చేస్తున్నారు. పట్టణంలోని వందకు పైకి విగ్రహాలు ఉన్నారు. వాటిలో ఘాట్‌లో నిమజ్జనం చేసెందుకు కమిటీ సభ్యులు అన్ని ఏర్పాట్లు చేశారు.

కోడుమూరు (రూరల్): వినాయక చవితి పర్వదినం పురస్కరించుకుని అన్ని గ్రామాల్లో వేడుకలు ఘనంగా జరుపుకుంటున్నారు. మండలంలోని అమడగుంట్ల, అనుగొండ, లద్దగిరి, గోరంట్ల, వెంకటగిరి, ముడుమలగుర్తి, క్రిష్టాపురం, వర్కూరు, పులకుర్తి, ప్యాలకుర్తి తదితర గ్రామాలలో శనివారం వినాయక విగ్రహాలను నెలకొల్పారు. సోమవారం వివిధ గ్రామాల్లో విగ్రహాల నిమజ్జనం జరుగనుంది.

గూడూరు: వినాయక చవితి పండుగను భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకోన్నారు. శనివారం గూడూరుతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లోని కాలనీలలో ఏర్పాటు చేసిన మండపాలల్లో వినాయకుడు కొలువుదీరాడు. స్వామి వారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. సోమవారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించనున్నారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ తిమ్మయ్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఓర్వకల్లు: మండలంలోని ఓర్వకల్లు, పూడిచెర్ల, నన్నూరు, ఉయ్యాలవాడ, గుట్టపాడు, సోమయాజులపల్లె, హుశేనాపురం, కన్నమడకల, శకునాల తదితర గ్రామాల్లో వినాయక విగ్రహాలను మండపాల్లో ఏర్పాటు చేసి పురోహితులతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గోవిందరెడ్డి, లక్ష్మికాంతరెడ్డి, మోహన్ రెడ్డి, సుధాకర్‌రావ, విశ్వేశ్వరరెడ్డి, చదువుల సుధాకర్ రెడ్డి పాల్గొన్నారు.



కుమ్మరిగేరిలో..



బాబాబృందావన్ నగర్‌లో పూజలందుకుంటున్న గణనాథుడు



వాసవీ నగర్‌లో...



కోడుమూరు మండలం అనుగొండలో..



గూడూరులో పూజలు చేస్తున్న భక్తులు



సి. బెళగల్‌లో..



కోడుమూరులో గణపతి విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

వినాయకుడికి పూజలు



గణపతి పూజల్లో పాల్గొన్న టీడీపీ 36వ వార్డు ఇన్‌చార్జి తిరుమలేశ్వరరెడ్డి

కల్లూరు, సెప్టెంబరు 8: కల్లూరు అర్బన్, రూరల్ మండల ప్రజలు వినాయక చవితి నవరాత్రి వేడుకలను వైభవంగా నిర్వహించారు. శనివారం వాడవాడలా గణనాథుడి భారీ విగ్రహాలు మండపాల్లో కొలువుదీరగా ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కల్లూరు అర్బన్‌లోని పెద్దపాడు, కృష్ణనగర్, పెద్దటేకూరులో పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరిత తనయుడు గౌరు జనార్ధన్‌రెడ్డి, 36వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ రెడ్డిగారి చంద్రకళాధర్‌రెడ్డి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం వినాయక కమిటీ సభ్యులు, అర్చకులు గౌరు జనార్ధన్‌రెడ్డికి స్వాగతం పలికి ఘనంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో పెద్దబీచుపల్లి, చిన్న బీచుపల్లి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



వినాయక చవితి వేడుకల్లో పూజలు నిర్వహిస్తున్న గౌరు జనార్దన్‌రెడ్డి

బస్తర్‌లో ఎన్‌కౌంటర్ హత్యలను ఆపాలి



మాట్లాడుతున్న ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి

కర్నూలు (కల్చరల్), సెప్టెంబరు 8: చత్తీస్‌ఘడ్‌లోని బస్తర్‌లో మావోయిస్టులను కేంద్ర పోలీసు బలగాలు ఎన్‌కౌంటర్ పేరుతో చేస్తున్న హత్యలను నిలిపివేయాలని ప్రజాస్వామ్య సంఘాల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. మావోయిస్టులను హత్య చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం నగరంలోని ప్రగతిశీల మహిళా సంఘం కార్యాలయంలో వారు విలేకరుల సమావేశం నిర్వహించారు. వేదిక కన్వీనర్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌ఘడ్‌లో కేంద్ర బలగాలు ఆదివాసీలపై యుద్ధం చేస్తున్నాయని ఆరోపించారు. ఈదేశ సంపదలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించడానికి, ఆదివాసీలను అడవులనుంచి తరిమివేయడానికి కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను చేపట్టిందని అన్నారు. తమ ప్రాంతాన్ని, తమ అడవులను కాపాడుకుంటూ ఉన్న ఆదివాసులపై భారత ప్రభుత్వం యుద్ధం చేస్తూ ఉందని, ఇప్పటికి చత్తీస్‌ఘడ్‌లో 250కి పైగా పోలీసు క్యాంప్‌లను ఏర్పాటు చేసిందని అన్నారు. ఈ ఏడాది జనవరి నుంచి రెండువందల మంది ఆదివాసులను, విప్లవకారులను భారత ప్రభుత్వం చంపివేసిందని నాయకులు విమర్శించారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకుడు సుంకన్న, ప్రజాభ్యుదయ సంస్థ నాయకుడు యోహాను, ప్రజా పరిరక్షణ వేదిక నాయకుడు డేవిడ్, కేఎన్‌పీఎస్ నాయకుడు సుబ్బరాయుడు, రాయలసీమ విద్యావంతుల వేదిక బాధ్యుడు రత్నం ఏసేపు తదితరులు పాల్గొన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(న్యూసిటీ), సెప్టెంబరు 7: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఐక్యపోరాటాలకు సిద్ధం కావాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు కే.ప్రభాకర్‌రెడ్డి కార్మికులు పిలుపునిచ్చారు. ఆదివారం ఏపీ వేర్‌హౌస్ హమాలీ యూనియన్ సర్వసభ్యసమావేశం సుందరయ్య భవన్‌లో సీఐటీయూ నగర అధ్యక్షుడు నరసింహులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ, రాష్ట్ర టీడీపీ ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరించే విధంగా యజమానులకు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా చట్టాలను చేస్తున్నాయని విమర్శించారు. అనంతరం యూనియన్ నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో యూనియన్ కార్యదర్శి జయన్న, అధ్యక్షుడు ఎం.మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

● కరాటే శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని సీనియర్ న్యాయవాది టికే.రామశేషన్న అన్నారు. స్థానిక జొహరాపురం భవిత ఇంగ్లీషు మీడియం పాఠశాలలో సుందరయ్య స్ఫూర్తి కేంద్రంలో, యూనివర్సల్ కరాటే మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ సంయుక్త అధ్వర్యంలో విద్యార్థులకు కరాటే బెల్ట్ గ్రేడింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ వ్యవస్థాపకుడు టి.శ్రీనివాసులు, కరాటే శిక్షకులు కే.సుధాకర్, అముతేశ్వర్, నాగన్న, బాలక్రిష్ణ పాల్గొన్నారు.

వినాయక ఘాట్ పరిశీలన

● భద్రతా ఏర్పాట్లపై ఎస్పీ ఆరా



వినాయక ఘాట్‌ను పరిశీలిస్తున్న ఎస్పీ

కర్నూలు, సెప్టెంబరు 8: నగరంలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే కేసీ కెనాల్, వినాయక ఘాట్‌లను ఎస్పీ జి. బిందుమాధవ్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వినాయక ఘాట్‌లో నిమజ్జన ఏర్పాట్లను ఆరా తీశారు. అలాగే ఘాట్‌లోని పరిసర ప్రాంతాలను కలియ తిరిగి పరిశీలించారు. వినాయక నిమజ్జనం సందర్భంగా నిమజ్జనానికి వెళ్లే విగ్రహాలు మొదట పాతనగరంలోని రాంబొట్ల దేవాలయం మొదటి విగ్రహం నుంచి వన్‌టౌన్, పూలబజార్, బాదమసీదు మీదుగా, కింగ్ మార్కెట్, కొండారెడ్డి బురుజు, అంబేద్కర్ సర్కిల్, పాత కంట్రోల్ రూమ్, కిడ్స్‌వరల్డ్, రాజ్‌విహార్ నుంచి కలెక్టరేట్ మీదుగా వినాయక ఘాట్‌కు వెళ్లే ఊరేగింపు ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు. ఎస్పీ వెంట డీఎస్పీ జే. బాబు ప్రసాద్, సీఐలు ప్రసాద్, రామయ్య నాయుడు, మురళీధర్ రెడ్డి, కేశవరెడ్డి, నాగరాజరావు, ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.

కొత్త టెక్నాలజీతో దంత వైద్యం

● ఘనంగా రాయలసీమ డెంటల్ అసోసియేషన్ వార్షికోత్సవం



డా. రాయపు రామచంద్రారెడ్డికి మెమెంటో అందిస్తున్న సీనియర్ దంత వైద్యులు

కర్నూలు(హాస్పిటల్), సెప్టెంబరు 8: కొత్త టెక్నాలజీతో దంత చికిత్స అందుబాటులోకి వచ్చిందని రాయలసీమ ప్రాంతానికి చెందిన డెంటల్ డాక్టర్లు అన్నారు. ఆదివారం నగర శివారులోని జి. పుల్లారెడ్డి డెంటల్ కాలేజీలో ఇండియన్ డెంటల్ అసోసియేషన్ రాయలసీమ శాఖ 40 సంవత్సరాల రూబీ జూబ్లీ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా కర్ణాటక రాష్ట్రం దావణగిరి కాలేజీ ఆఫ్ డెంటల్ సైన్సెస్ ప్రిన్సిపాల్ డా. బీవీ సుబ్బారెడ్డి ఐడీఏ స్టేట్ సెక్రటరీ అజయ్ బెనర్జీ, అధ్యక్షుడు నామినేని కిరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐడీఏ రాయలసీమ శాఖ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డా. ఉపేంద్రనాథ్‌రెడ్డి, డా. రాయపు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఐడీఏ రాయలసీమ శాఖ 1984లో కర్నూలు, తిరుపతిలో 10 మంది దంత వైద్యులతో ప్రారంభమైందని, ప్రస్తుతం వందల సంఖ్య దంత వైద్యులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో జి. పుల్లారెడ్డి డెంటల్ కాలేజీ ప్రిన్సిపాల్ డి. మురళీధర్ రెడ్డి, దంత వైద్యుడు డా. సునీల్ కుమార్ రెడ్డి, నరేష్ గౌడు, సతీష్, యశ్వంత్, సందీప్, మంజునాథ్, దత్తాసాయి కిరణ్, నాగలక్ష్మి రెడ్డి, సీనియర్ దంత వైద్యులు పాల్గొన్నారు.

వినాయక ఘాట్‌కు జలహారతి



వినాయక ఘాట్‌కు హారతి ఇస్తున్న పూజారులు

కోడుమూరు, సెప్టెంబరు 8: స్థానిక గణేశ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో వినాయక ఘాట్‌కు జలహారతి కార్యక్రమాన్ని ఆదివారం చేపట్టారు. వినాయక చవితి పండుగ పురస్కరించుకొని పట్టణంలో వినాయక విగ్రహాలు కొలువుదీరాయి. మూడు రోజుల పూజలు అందుకున్న విగ్రహాలను సోమవారం రోజు నిమజ్జనం చేయనున్నారు. ఇందులో భాగంగా గంగమ్మకు పూజలు చేపట్టారు. ధ్వజరోహణ, గోపూజా, గంగాహారతి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గణేష్ ఉత్సవ సమితి కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, ఈశ్వర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కిరణ్, మాజీ సర్పంచు సీబీలత, ఎద్దుల మహేశ్వరరెడ్డి, రవి, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు కూరగాయలు



జెండా ఊపి కూరగాయల వాహనాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

కోడుమూరు, సెప్టెంబరు 8: విజయవాడ వరద బాధితుల కోసం కోడుమూరు పట్టణ టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో వివిధ రకాల 3.50 టన్నుల కూరగాయలను ఆదివారం పంపించారు. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు కేఈ మల్లికార్జునగౌడ్ మాట్లాడుతూ కోడూమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, పార్టీ సీనియర్ నాయకులు డి.విష్ణువర్ధన్ రెడ్డి సలహా మేరకు టీడీపీ నాయకులు, కార్యకర్తలంతా విరాళాలు సేకరించి విజయవాడలోని వరద బాధితులకు ప్రత్యేక వాహనంలో పంపించామన్నారు. అంతేకాకుండా అవసరమైన నిత్యవసర సరుకులు కూడా పంపించామన్నారు. ఇందులో కొంత మంది స్పందించి ముందుకు వచ్చి విరాళాలు ఇచ్చారని ఆయన చెప్పారు. అద్దుగల కోదండరామిరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు కళ్యాణ్‌రామిరెడ్డి, విజయరామిరెడ్డి రూ.10వేలు విరాళం అందించారని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గోపాల్‌నాయుడు, బడేసాగౌడ్, ఎల్లప్పనాయుడు, బ్రిటీష్‌రాముడు, మధు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల వ్యాపారిని అటకాయించి చోరీ

కర్నూలు, సెప్టెంబరు 8: నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో కొత్తబస్టాండు వెనుకాల గొర్రెల వ్యాపారి గోపాల్‌ను ఆటకాయించి గుర్తు తెలియని వ్యక్తులు రూ.30వేలు చోరీ చేశారు. రాజీవ్‌నగర్‌కు చెందిన గోపాల్ గొర్రెల వ్యాపారం చేస్తుంటాడు. ఆదివారం తెల్లవారుజామున గొర్రెలను కొనుగోలు చేసేందుకు వెళ్తుండగా.. నలుగురు ఆగంతకులు ఆటకాయించి బెదిరించి నగదును చోరీ చేశారు. బాధితుడు పోలీసులను ఆశ్రయించారు.

వంతెన.. ప్రమాదం అంచున

- కనకదిన్నె వంతెనపై చెట్లు
- భద్రతపై ప్రయాణికుల ఆందోళన



వంతెనపై పెరిగిన చెట్లు

పత్తికొండ, సెప్టెంబరు 8: పత్తికొండ - కర్నూలు రహదారిపై కనకదిన్నె గ్రామం వద్ద హంద్రీ వంకపై బ్రిటీష్ కాలంలో వంతెన నిర్మించారు. ఈ రహదారిపై దాదాపు 2వేల మరకు వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. వంతెనపై చెట్లు పెరుగుతుండటంతో దాని భద్రతపై ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు.

రెండేళ్ల క్రితం పిల్లర్ల నిర్మాణం

బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో రెండేళ్ల క్రితం రూ.18లక్షల వ్యయంతో ఆర్‌అండ్‌బీ అధికారులు నూతన పిల్లర్‌ను నిర్మించారు. అయితే నిర్వహణ లోపించడంతో చెట్లు తిరిగి పెరగడంతో వంతెన భద్రతపై ఆందోళన చెందుతున్నారు. చెట్ల వేర్లు వంతెన లోపలికి వెళ్లిపోతున్నాయి. అధికారులు స్పందించాల్సి ఉంది

రెండేళ్ల నుంచి నిధులు లేవు

వంతెన నిర్వహణకు ప్రభుత్వం నుంచి నిధులు రాలేదు. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేయిస్తాం.

- నాగ వెంకటేశ్వర్ రెడ్డి, డీఈ, ఆర్‌అండ్‌బీ

రేపు జాబ్ మేళా: ఎంఈవో

గోనెగండ్ల, సెప్టెంబరు 8: నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పదో తేదీన కోడుమూరు పట్టణంలోని జూనియర్ కళాశాలలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎంఈవో రామాంజినేయులు ఆదివారం తెలిపారు. ఉదయం 9 గంటలకే ప్రారంభమవుతుందని జీప్‌టో, ఎల్ఎన్‌టీ, ఫైనాన్స్, ఎర్‌కోఫర్స్, స్విగ్గి, కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నారన్నారు. పదోతరగతి. ఇంటర్, డిగ్రీ, పీజీ చదివి 18 నుంచి 30 ఏళ్ల లోపు వయస్సు ఉండాలని విద్యార్హతల జిరాక్స్ కాపీలు, బయోడేటా, ఆధార్, రెండు ఫొటోలు తీసుకెళ్లాలని కోరారు.

స్వాహాదారులపై చర్య తీసుకోవాలి

నందవరం, సెప్టెంబరు 8: మండలంలోని ప్రభుత్వ భూములను స్వాహా చేసినవారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు గురురాజారావు డిమాండ్ చేశారు. నూతన తహసీల్దారు శ్రీనివాసులును ఆదివారం పెద్ద మనుషుల చేతుల్లో అధికంగా ప్రభుత్వ భూములు స్వాహా అయ్యాయని విచారణ చేయాలని కోరారు. రామన్నగౌడ్, సాధిక్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి

మద్దికెర, సెప్టెంబరు 8: విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు వీరేంద్ర, ఆర్ఎంపీ వైద్యులు కానుగుల రామాంజనేయులు అన్నారు. ఆదివారం పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని శ్రావణికి వారు వెండి పథకాన్ని బహూకరించారు. నాయీ బ్రాహ్మణులు బాగా చదివి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. మంగళి ఎర్రిస్వామి, శేఖర్, సుదర్శన్ ఉన్నారు.

లారీ బోల్తా

వెల్దుర్తి, సెప్టెంబరు 8: వెల్దుర్తి సమీపంలోని అమెజాన్ హోటల్ వద్ద జాతీయరహదారిపై శనివారం తెల్లవారుజామున లారీ బోల్తాపడింది. డ్రైవర్ రాజేష్, క్లీనర్ మనోజ్ స్వల్పగాయాలతో బయటపడ్డారు. హైదరాబాదు నుంచి తమిళనాడుకు కెఎ52 బి8412 వాహనం గ్రానైట్ కటింగ్ యంత్రాలతో వెళుతుండగా వెల్దుర్తి వద్ద అదుపు తప్పింది. పోలీసులు చేరుకొని క్రేన్ సాయంతో రోడ్డుపై అడ్డుగా ఉన్న లారీని తొలగించారు.

నిబంధనల ప్రకారమే ఉత్సవాలు చేసుకోవాలి

తుగ్గలి, సెప్టెంబరు 8: నిబంధనల ప్రకారమే ఉత్సవాలను చేసుకోవాలని పత్తికొండ రూరల్ సీఐ పులిశేఖర్ తెలిపారు. శనివారం జొన్నగిరి, తుగ్గలి తదితర గ్రామాల్లో వినాయక మండపాల నిర్వాహకులకు నోటీసులు అందించారు. గణేష్ ఉత్సవాల్లో అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నోటీసులు ఇచ్చామని అల్లర్లు చోటుచేసుకుంటే నిర్వాహకులదే బాధ్యత అని హెచ్చరించారు. ఫ్యాక్షన్ గ్రామాల్లో పికెట్ ఏర్పాటు చేశామన్నారు.

తెగిపడిన విద్యుత్ తీగలు

పత్తికొండ టౌన్, సెప్టెంబరు 8: పట్టణంలోని ఓ హోటల్ వద్ద ఉన్న కూరగాయాల దుకాణంపై ఆదివారం ఉదయం విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. స్థానికులు భయాందోళనకు గురై పరుగులు తీశారు. స్థానికుల సమాచారంతో విద్యుత్ అధికారులు చేరుకుని విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ప్రమాదం చోటుచేసుకోకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

కారు దొంగిలించిన నిందితుడి అరెస్టు


నందరవరం స్టేషన్‌లో నిందితునితో తాలుకా సీఐ, ఎస్ఐ

నందవరం, సెప్టెంబరు 8: మండలంలోని దర్మాపురం టోల్‌గేట్ వద్ద ఇటీవల కారు దొంగతనం చేసిన నిందితుడిని ఆదివారం అరెస్టు చేసినట్లు తాలుకా సిఐ విక్రమసింహా, నందవరం ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వివరాల మేరకు.. కర్నాటక బాగల్‌కోట్ జిల్లాలోని శిరోల్ గ్రామంలో విచారించుకున్న సమాచారం మేరకు ఎమ్మిగనూరులోని ఆదోని రోడ్డు ఫైర్‌స్టేషన్ వద్ద ఎ2 ముద్దాయి సంతోష్ ఉండగా అదుపులోకి తీసుకున్నట్లు, పంచాయతీ అధికారుల ద్వారా పంచనామా నిర్వహించినట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

మంత్రాలయం, సెప్టెంబరు 8: ఆర్టీసీ బస్టాండు వద్ద కర్ణాటక నుంచి ఎమ్మిగనూరుకు మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఇరువురిని అదుపులోకి తీసుకున్నట్లు సీఐ రామాంజులు, ఎస్ఐ పరమేశ్వర్ నాయక్ తెలిపారు. వివరాల మేరకు.. ఆదివారం సీఐ రామాంజులు తెలిపిన మేరకు.. ఎమ్మిగనూరు చెందిన వెంకటేశ్, చిలకలడోణకు చెందిన వెంకటేశ్వర్లు వేర్వేరు సమయాల్లో మద్యాన్ని తరలిస్తున్న సమాచారం మేరకు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరు పరచగా.. ఆదోని సబ్‌జైలుకు రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

మంత్రాలయానికి పోటెత్తిన భక్తులు


శ్రీమఠం ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు

మంత్రాలయం, సెప్టెంబరు 8: రాఘవేంద్రస్వామి దర్శనార్థం భక్తులు మంత్రాలయానికి పోటెత్తారు. నదిలో పుణ్యస్నానాలు ఆచరించి మంచాలమ్మను దర్శించుకుని రాఘవేంద్రస్వామికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

చవితి ఉత్సవాలు ప్రారంభం

ఆదోని, ఎమ్మిగనూరు, మంత్రాలయం, పత్తికొండ నియోజక వర్గాల పరిధిలో వినాయక చవితి నిర్వహించారు. పట్టణాలు, గ్రామాల్లో విగ్రహాలను ఏర్పాటు చేశారు. రాజకీయ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. కొన్ని ప్రాంతాల్లో మూడోరోజు, ఐదవ రోజున, కర్నూలులో తొమ్మిదో రోజున నిమజ్జనం చేయనున్నారు.


ఆదోని: సంతపేటలో...


ఎమ్మిగనూరులో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బీవీ


ఆలూరులో కొలువుదీరిన వినాయకుడు


కౌతాళంలో సింహ వాహనంపై..


గోనెగండ్లలో పూజలు చేస్తున్న పీఠాధిపతి


కోసిగి: గీతామందిరంలో...


పెద్దకడుబూరులో...


పత్తికొండలో టీడీపీ నాయకులు


పూజలు చేస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి


మంత్రాలయంలో పీఠాధిపతి పూజలు


నందవరంలో భక్తులు


తుగ్గలి: పగిడిరాయిలో...

దేవాలయ భూములు అన్యాక్రాంతం

హొళగుంద, సెప్టెంబరు 8: హొళగుంద గ్రామ శివారులోని అగ్రహారం ఆంజనేయస్వామి, కోట ఆంజనేయస్వామి ఆలయాల మాన్యం భూములు అన్యాక్రాంతం అయినట్లు ఎండోమెంట్ అధికారి నరేంద్ర ఆదివారం తెలిపారు. అగ్రహారం ఆంజనేయస్వామి మాన్యం 50 ఎకరాలకు పైగా ఉన్నట్లు రికార్డుల్లో ఉండగా, అనుభవంలో 33 ఎకరాలు ఉన్నట్లు తెలిపారు. మిగతా 17 ఎకరాలు ఎవరు సాగుచేస్తున్నారో తెలియదన్నారు. అలాగే హొళగుందలోని కోట ఆంజనేయస్వామికి చెందిన మన్యం భూములు 30 ఎకరాలకు పైగా ఉన్నట్లు రికార్డుల్లో ఉందని, సర్వే నెంబర్లు ఉన్నాయని, రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు. టీడీపీ నాయకులు రాజా పొంపన్న గౌడ, పొంపాపతి, ఎర్రిస్వామి, దిడ్డి వెంకటేష్, అంజి, భక్తులు ఉమేష్, రఘు పాల్గొన్నారు.

తీగలు చోరీ

కోసిగి, సెప్టెంబరు 8: తాగునీటి బోర్ల తీగెలు చోరీకి గురైనట్లు సర్పంచ్ అయ్యమ్మ, కార్యదర్శి తిరుమలేశ్వరరెడ్డి ఆదివారం తెలిపారు. దీంతో తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందని తెలిపారు. పులికనుమ ప్రాజెక్టు సమీపంలోని పంచాయతీ 8 బోర్ల తీగెల విలువ రూ.70వేలు ఉంటుందని తెలిపారు. కోసిగి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

నీచ రాజకీయాలు చేస్తున్న జగన్

మద్దికెర, సెప్టెంబరు 8: మాజీ సీఎం వైఎస్ జగన్ నీచ రాజకీయాలు చేస్తున్నారని మాజీ జడ్పీటీసీ జమేదార్ రాజన్న యాదవ్, పట్టణ టీడీపీ అధ్యక్షులు గడ్డం రామాంజులు, టీడీపీ నాయకులు టైలర్ హరి అన్నారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాత్రి, పగలు తేడా లేకుండా విజయవాడలోనే ఉంటూ వరద బాధితులను ఆదుకుంటుంటే జగన్ బురద రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. పలు మీడియా సంస్థలపై నిందలు మోపడం మంచి పద్ధతి కాదన్నారు.

చీకటి రోజుకు ఏడాది పూర్తి

గోనెగండ్ల, సెప్టెంబరు 8: టీడీపీ అధినేత చంద్రబాబుని అక్రమంగా అరెస్టు చేసిన చీకటి రోజుకు ఏడాది పూర్తయినట్లు టీడీపీ నాయకులు నూరహమ్మద్, మిన్నల్ల, కొత్తింటిఫక్రుద్దీన్, మదీనా, పేటమాబు అన్నారు.

గుమ్మనూరు ఫ్లెక్సీల కలకలం


ఆలూరులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

ఆలూరు, సెప్టెంబరు 8: మాజీ మంత్రి, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుటుంబసభ్యులు వేసిన ఫ్లెక్సీలు పట్టణంలోని టీడీపీ వర్గాల్లో చర్చకు దారితీశాయి. టీడీపీకి పూర్వ వైభవం గుమ్మనూరు కుటుంబంతోనే సాధ్యమంటూ ఫ్లెక్సీలు వేయడంతో పార్టీలో గందరగోళం నెలకొంది. ఆలూరుకు ఇప్పటికీ టీడీపీ ఇన్‌చార్జిను అధినాయకత్వం ప్రకటించలేదు. ప్రస్తుతానికి గత ఎన్నికల్లో పోటీచేసి ఓడిపోయిన వీరభద్రగౌడ్ వ్యవహరిస్తున్నారు. ఇన్‌చార్జిగా వైకుంఠం శివప్రసాద్, జ్యోతి, చిప్పగిరి మాజీ జడ్పీటీసీ మీనాక్షినాయుడు, వెంకటేష్ చౌదరి ప్రయత్నం చేస్తున్నారు. ఈ తరుణంలో మాజీ మంత్రి, కుమారుడు ఈశ్వర్, నారాయణస్వామి, శ్రీనివాసులతో ఫ్లెక్సీలు వేస్తూ, వినాయకచవితి శుభాకాంక్షలు తెలియజేయడంతో పార్టీలో ఇదే చర్చ సాగుతోంది.

వరద బాధితుల కోసం విరాళాలు


విరాళాలు సేకరిస్తున్న ఆదోని ఎమ్మెల్యే


మద్దికెర: పెరవలిలో టీడీపీ నాయకులు


విరాళం అందజేస్తున్న టీడీపీ నాయకులు

ఆదోని, సెప్టెంబరు 8: తెలుగు రాష్ట్రాల వరద బాధితులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని బీజేపీ ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి పేర్కొన్నారు. ఆదివారం మునిసిపల్ మెయిన్ రోడ్డులో జోలిపట్టి విరాళాలు సేకరించారు. తన వంతుగా నెల వేతనాన్ని అందిస్తానన్నారు. పారిశ్రామికవేత్త విట్టా రమేష్ తనవంతు .లక్ష, మల్లిక అవ్వ రూ.50 వేలు, చెన్న బసప్ప రూ.25వేలు అందజేశారు. బిజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిని నీలకంఠ, విట్టా రమేష్, నాగరాజ్ గౌడ్, శ్రీనివాసాచారి, సాయి, ఉపేంద్ర, చిన్న బసప్ప, భీమన, మల్లిక అవ్వ పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకోవాలి

మద్దికెర: విజయవాడ వరద బాధితులను ఆదుకోవాలని దాత పారా విశ్వనాథ్ (చిట్టెన్న), మెడికల్ తిమ్మప్ప అన్నారు. ఆదివారం పెరవలి గ్రామంలో ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు ఆధ్వర్యంలో విరాళాలు సేకరించారు. విరాళాలను ఎమ్మెల్యేకు అందజేస్తామని అన్నారు. నరసింహులుగౌడ్, మూలింటి రంగస్వామి, నరేంద్ర, పారా రవి, తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి: మండలంలోని ముక్కెలల్లో టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి తుగ్గలి నాగేంద్రకు ముక్కెల్ల సర్పంచ్ సుజాత, టీడీపీ నాయకులు రామచంద్ర, మునెప్పతో పాటు గ్రామస్థులు రూ.80వేలు విరాళం ఇచ్చారు. తుగ్గలి నాగేంద్ర మాట్లాడుతూ మండలం నుంచి విజయవాడ వరద బాదితులకు ఇప్పటికే రూ.10లక్షలకు పైగా విరాళాలు వచ్చాయనీ, టీడీపీ నాయకులు ఐస్.మల్లయ్య రూ.50వేలు, ఎర్రగుడి వెంకటస్వామి రూ.50వేలు అందించాని అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తిమ్మయ్య చౌదరి, శివరాముడు చౌదరి, బాలు, జంగం చంద్ర, నాగేష్, విద్యాకమిటీ చైర్మన్ మల్లి, శేషప్ప, లక్ష్మణ స్వామి, డీలర్ వీరాంగులు, మునిస్వామి పాల్గొన్నారు.

దేవనకొండ: టీడీపీ, జనసేన ఆధ్వర్యంలో రూ.4.90 లక్షలు సేకరించారు.గుండ్లకొండ రాందాస్‌గౌడ్ , వెంకటసాయి ట్రేడర్స్ వేణు, శివ రూ.50వేలు, చెల్లెలచెలిమల నాగేంద్రగౌడ్, సాయిగణేష్ ట్రేడర్స్ రూ.20 వేలు చొప్పున అందజేశారు. కన్వీనర్ విజయభాస్కర్‌గౌడ్ ,రంగన్న, జగదీష్, మలకన్న, వీరేష్ నిధులను టీడీపీ నాయకుడు వీరభద్రగౌడ్‌కు అందజేయనున్నట్లు తెలిపారు.

ఈకేవైసీ చేసుకోవాలి: ఏడీఏ

గోనెగండ్ల, సెప్టెంబరు 8: రైతులు తమ పంటల విరాలను 15వ తేదీలోపు ఈకేవైసీ చేసుకోవాలని ఏడీఏ మహమ్మద్ ఖాద్రీ, ఏవో హేమలత సూచించారు. చేసుకుంటేనే ప్రభుత్వ పథకాలు అందుతాయని వివరించారు.

క్షమాపణ పర్వ్ మహోత్సవం

ఆదోని టౌన్, సెప్టెంబరు 8: జైనుల క్షమాపణ వారోత్సవ ముగింపు ఆదివారం నిర్వహించారు. వీధులలో ఊరేగించి, విమల్‌నాథ్ ఆలయానికి చేరుకొని, పూజలు నిర్వహించి, తిరిగి వాసుపూజ్య మందిర్‌కు చేరుకొంది.

వైద్యం అందించండి: సబ్ కలెక్టర్

ఆదోని, సెప్టెంబరు 8: ఆలూరు మండలం హులేబీడు గ్రామం వద్ద రోడ్డు ప్రమాదంలో గాయాల గురైన వారికి మెరుగైన వైద్యం అందించాలని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ ఆదేశించారు. ఆదివారం బాధితులను పరామర్శించారు. తీవ్రంగా గాయపడ్డవారిని కర్నూలు తరలించేందుకు ఏర్పాట్లు చేశామని అన్నారు.

క్షతగాత్రులను ఎమ్మెల్యే పార్థసారథి పరామర్శించారు. గాయపడ్డవారు కోలుకోవాలని ఆకాంక్షించారు. జనసేన ఇన్‌చార్జి మల్లప్ప, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ, సాయి, మల్లిక అవ్వ పాల్గొన్నారు.


ఆసుపత్రి వద్ద బాధితులను పరామర్శిస్తున్న సబ్‌కలెక్టర్